

రేపు జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపికలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వచ్చే నెల 7, 8 తేదీల్లో విశాఖలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 17వ తేదీన నగరంలోని శాంతినగర్ కాలనీలోని స్విమ్మింగ్ ఫూల్ వద్ద క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర స్విమ్మింగ్ ఫూల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కె.ఎన్.ఎస్.వి ప్రసాద్ (హారికా ప్రసాద్), ఉపాధ్యక్షులు వై.సూర్యారావు, జోగినాయుడు, జిల్లా కార్యదర్శి ఝాన్సీ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కాంతారావు తెలిపారు. వింటర్ సబ్ జూనియర్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు వీలుగా ఈ ఎంపిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు ఎప్పుడు..?

- నేటికీ ఖరారు కాని ధాన్యం లక్ష్యం
- తొమ్మిది లక్షల టన్నులు రావచ్చని వ్యవసాయశాఖ అంచనా
- 4.90 లక్షల టన్నులు సేకరించాలని పౌర సరఫరాల సంస్థ నిర్ణయం
- పూర్తిస్థాయిలో కొనాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం


ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇప్పటికీ లక్ష్యం ఖరారు కాలేదు. జిల్లాలో ఈ ఏడాది తొమ్మిది లక్షల టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు పౌరసరఫరాల సంస్థ అధికారులు, ఉన్నతాధికారుల సూచన మేరకు 4.90 లక్షల మెట్రిక్ టన్నులు కొనేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇటీవల ఖరీఫ్ ధాన్యం సేకరణపై మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష నిర్వహించి జిల్లాలో ఎంతమేర దిగుబడి వస్తే, అంత పరిమాణంలో ధాన్యం కొనాలని అధికారులకు సూచించారు. దీంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ధాన్యం సేకరణ లక్ష్యం పెంచి కొనుగోలు చేయాలని భావిస్తున్నారు.



బూర్జ మండలం నీలాదేవిపురంలో ధాన్యం బస్తాలను లారీలో తరలిస్తున్న దళారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 3,59,495 ఎకరాల్లో వరి పంట వేశారు. ఈ ఏడాది తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల అవసరాలు, తిండి గింజలకు పోనూ ఐదు లక్షల ధాన్యం వరకు మార్కెట్‌లోకి రావచ్చని పౌరసరఫరాల సంస్థ అధికారులు అంచనా వేశారు. అన్ని లెక్కగట్టి చివరకు 4.90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. అందుకనుగుణంగా కొనుగోలు కోసం 402 కేంద్రాలను గుర్తించారు. ఇటీవల వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి, దిగుబడి వచ్చిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ధాన్యం సేకరణ పెంచే దిశగా ఆలోచన చేస్తున్నారు. అందుకనుగుణంగా ఏర్పాట్లును చేసే పనిలో నిమగ్నమయ్యారు. అదనంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల గుర్తింపు, మిల్లుల కేటాయింపు, సిబ్బంది నియమాకంపై దృష్టిసారించారు. దీంతో ధాన్యం కొనుగోలు ప్రారంభం మరింత జాప్యం కావచ్చని అధికారులు భావిస్తున్నారు. వాస్తవానికి ఈనెల 17వ తేదీ నుంచి ధాన్యం కొనాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే కొంత జాప్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ధాన్యం సేకరణ ఈనెల 20వ తేదీ తర్వాత ప్రారంభం కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.



ధాన్యం కొనుగోలులో స్వల్ప మార్పులు

ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం స్వల్పంగా కొన్ని మార్పులు చేసింది. గతంలో ధాన్యం ఏ మిల్లుకు వెళ్లాలో సాఫ్ట్‌వేర్ ద్వారా నిర్ణయించేవారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికింది. ధాన్యం కొనుగోలులో గతేడాది రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. మిల్లర్లు ఇచ్చిన బ్యాంకు గ్యారంటీ విలువ పూర్తవడంతో దూర ప్రాంతాల్లోని మిల్లులకు కేటాయించారు. ముఖ్యంగా ఒక మండలానికి చెందిన రైతులకు 40, 50 కిలోమీటర్ల దూరంలో వేరే మండలంలో ఉన్న మిల్లులకు కేటాయించారు. దీంతో రైతులు తీవ్ర వ్యయ ప్రయాసలకు లోనయ్యారు. ఈసారి ఆరకమైన ఇబ్బందులు తప్పనున్నాయి.

రైతులకు మద్దతు ధర దక్కేనా?

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది వరికి సాధారణ రకానికి రూ.2,300, గ్రేడ్-ఎ రకానికి రూ.2,320 మద్దతు ధర ప్రకటించింది. గతేడాది కొంతమంది రైతులు తీసుకువెళ్లినా ధాన్యం నాణ్యంగా లేవంటూ తిప్పి పంపారు. కొన్ని రైతుభరోసా కేంద్రాల్లో తమ లక్ష్యం పూర్తయిందని ఇక కొనలేమంటూ సిబ్బంది చెప్పడంతో, దళారులకు తక్కువ రేటుకే అమ్ముకోవాల్సి వచ్చింది. ఇప్పటికే జలుమూరు, సారవకోట, నరసన్నపేట, బూర్జ మండలాల్లో తక్కువ ధరకే రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్న పరిస్థితి నెలకొంది. 80 కేజీల బస్తాను రూ.1400 నుంచి రూ.1450 మధ్య కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అటు తూకంలోనూ దళారులు మూడు నుంచి నాలుగు కేజీల వరకు అదనంగా తీసుకుంటున్నట్లు రైతులు వాపోతున్నారు.

సిబ్బంది నియామకం బాధ్యత ఏజెన్సీలదే...

కేంద్రాల్లో ధాన్యం నాణ్యతా ప్రమాణాల పరిశీలన, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు వంటి అవసరాల కోసం టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికపై ఏటా ప్రభుత్వమే నియమించేది. వారికి నాలుగు నెలల పాటు వేతనాలు చెల్లించేది. ఈసారి ధాన్యం కొనుగోలు చేపట్టనున్న పిఎసిఎస్, డిసిఎంఎస్, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు తదితర ఏజెన్సీలే సిబ్బందిని నియమించుకోవాలని అధికారులు సూచించారు. గతంలో ప్రభుత్వం వేతనాలు చెల్లించడంతో, వారికి సకాలంలో జీతాలు రావడంతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన మేర డబ్బులు వచ్చేవి. ఇప్పుడు ఏజెన్సీలు బాధ్యతలు తీసుకోవడంతో అవి ఎంతవరకు కచ్చితంగా అమలవుతాయో చూడాల్సి ఉంది.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

పోరాడే వారిని 'మండలి'కి పంపిద్దాం

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరిని గెలిపించాలి
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కులను రక్షించుకోవడానికి పోరాడే సత్తా ఉన్న వారినే శాసనమండలికి పంపించాలన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను పోషిస్తున్నారని గుర్తు చేశారు. విద్యార్థి, యువజన, సైన్స్ ఉద్యమాల్లో కొనసాగి, ఉపాధ్యాయ ఉద్యమంలో చురుగ్గా ఉంటూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం పనిచేసిన విజయ గౌరిని ఎమ్మెల్సీగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ప్రభుత్వ విద్యారంగానికి 30 శాతం నిధులు బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాల్సి ఉన్నా, పది శాతం కూడా కేటాయించడం లేదని విమర్శించారు. నిధులేమి వల్ల ప్రపంచ బ్యాంకు నిధులతో విద్యారంగాన్ని అభివృద్ధి చేయడానికి చేస్తున్న ప్రయత్నం విద్య ప్రైవేటీకరణకు దారితీస్తుందన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలహీనపరిచే విధానాలను ఉపాధ్యాయులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవడానికి బడి కోసం బస్సు యాత్ర నిర్వహించిన ఘనత పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు, యుటిఎఫ్‌కు మాత్రమే దక్కుతుందన్నారు.

గత ప్రభుత్వ బాటలోనే...

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తుందని ఆశించినా ఆ దిశగా ఆలోచనలు కనిపించడం లేదన్నారు. వైసిపి ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తోందని విమర్శించారు. జిఒ నంబరు 117, సాల్ట్ పథకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సి 2023 జూన్ నుంచి రావాల్సి ఉన్నా, ఇంతవరకు కమిషన్‌ను నియమించలేదన్నారు. తక్షణం 12వ పిఆర్‌సి కమిషన్ నియమించి 30శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్, గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ అపార్, బోధనేతర పనులతో ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదన్నారు. ఈనెల 24, 25 తేదీల్లో మందసలో నిర్వహించే యుటిఎఫ్ 17వ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, నాయకులు కె.దాలయ్య, బి.రవికుమార్, కె.వైకుంఠరావు, దమయంతి, పి.అప్పారావు, వై.ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

సిబ్బంది సంక్షేమమే ప్రాధాన్యం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి వ్యక్తిగత, ఉద్యోగ రీత్యా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బందికి ప్రత్యేకంగా పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఉద్యోగ, వ్యక్తిగత, అనారోగ్య సమస్యలను సిబ్బంది ఎస్‌పికి విన్నవించారు. వినతులపై సానుకూలంగా స్పందించిన ఎస్‌పి, ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసానిచ్చారు. ఉద్యోగ రీత్యా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిబ్బందికి ఎటువంటి సమస్య ఉన్నా నిత్యం అందుబాటులో ఉంటానని, నిర్భయంగా తెలపవచ్చన్నారు. అత్యవసరమైనప్పుడు ఫోన్ చేసి సమస్యలను చెప్పాలన్నారు. గ్రీవెన్స్ డేను సిబ్బంది కోసం ప్రతి శుక్రవారం నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమశిక్షణ, బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అంకితభావంతో విధులు నిర్వర్తించాలని మానసిక, శారీరకంగా దృఢంగా ఉండి ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు. పలు ముఖ్యమైన అంశాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

ఆ భూములను డీ నోటిపై చేయాలి

రెవెన్యూ మంత్రికి ఎమ్మెల్యే శంకర్ వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గార మండలం మొగదాలపాడులో భూములు గతంలో అటవీ భూములుగా ప్రభుత్వ రికార్డులో నమోదయ్యాయని, వాటిని డీ నోటిపై చేయాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. ఈమేరకు అమరావతిలోని సచివాలయంలో మంత్రి ఛాంబరులో మంత్రిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు వారి భూముల అమ్మకాలు, కొనుగోలు చేసుకునేలా ఉత్తర్వులు కల్పించాలని కోరారు. ఇటీవల నిర్వహించిన ప్రజాదర్బార్‌లో తమ భూములు అటవీశాఖ భూములుగా రికార్డుల్లో నమోదై ఉండడంతో, ఈ భూములపై తమ హక్కును కోల్పోవాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారని వివరించారు. వారి అభ్యర్థనను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్లను కలిసిన ఆయన అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించే రథసప్తమి వేడుకను రాష్ట్ర పండగగా గుర్తించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

గిరిజనుల అభ్యున్నతే ధ్యేయం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - మెళియాపుట్టి

గిరిజనుల జీవితాలను మెరుగుపరచడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడమే 'ధర్తి ఆబా జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్' లక్ష్యమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 'జన జాతీయ గౌరవ్ దివస్' లబ్ధిదారులతో కలిసి ఈ-సంవాద్‌లో గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి దేశవ్యాప్త కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి మెళియాపుట్టి మండలంలోని ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్ వేదికగా నిలిచింది. ఐటిడిఎ పిఒ యశ్వంత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా బాధితులను ఐటిడిఎలో గుర్తిస్తున్నామని, వారికి పెద్దఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పిఎం జన్మ కింద 11 అంశాలను గిరిజనుల్లోకి తీసుకెళ్తున్నామని, అన్ని గిరిజన పాఠశాలల్లో ప్రత్యేకంగా క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. గిరిజన కోపరేటివ్ సొసైటీ ఉత్పత్తులకు పెద్ద ఎత్తున గిరాకీ కల్పించేలా చర్యలు చేపడుతున్నామని, సేంద్రియ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉందన్నారు. పేరొందిన అన్ని ప్రముఖ బ్రాండ్ల దుకాణాల్లో జిసిసి ఉత్పత్తులు లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిసిసి ఉత్పత్తులకు ప్రత్యేక స్టాల్స్, మేళాలు ఏర్పాటు చేస్తామని, ఈ-కామర్స్ వెబ్‌సైట్‌లో ఈ ఉత్పత్తులన్నీ లభించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. ప్రాసెసింగ్, బ్రాండింగ్, లేబులింగ్ తదితర విషయాలపై గిరిజనులు పూర్తి అవగాహన పెంచుకున్నప్పుడే ఆర్థికాభివృద్ధిని సాధించగలరన్నారు.

ఐటిడిఎ పిఒ యశ్వంత్ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాల రూపొందిస్తున్నామన్నారు. అన్ని పాఠశాలల్లో ఆర్ఒ వాటర్ ప్లాంట్‌లో ఏర్పాటు చేశామన్నారు. రూ.1.30 కోట్లతో ఏకలవ్య పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఐటిడిఎకు రెండు ప్రత్యేక అంబులెన్స్‌లు ఉన్నాయని, త్వరలోనే మరో మూడు అంబులెన్స్‌లు కొత్తవి కొనుగోలు చేస్తామన్నారు. రూ.28 కోట్లతో గిరిజన గ్రామాల్లో రోడ్లను వేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం 138 మందికి ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు, సికిల్‌సెల్ ఎనీమియా కార్డులు, ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు, భూసార పరీక్షల ఫలితాల పత్రాలు అందజేశారు.

తొలుత గిరిజన విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అల్లూరి, బిర్స ముండా వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి, ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, ఇఇ రమాదేవి, డిఆర్‌డిఎ, గృహనిర్మాణశాఖ పీడీలు కిరణ్ కుమార్, నగేష్, గిరిజన సంక్షేమ శాఖ డిఇ సిమ్మన్న, తహశీల్దార్, ఎంపిడిఒ, సర్పంచ్ లక్ష్మమ్మ, గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.



స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

'స్వాభిమాన్'కు 14 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రతినెలా మూడో శుక్రవారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే స్వాభిమాన్‌కు 14 వినతులు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వికలాంగుల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో నకిలీ వికలాంగుల సర్టిఫికేట్లతో పెన్షన్లు, ఉద్యోగాల్లో కొందరు రిజర్వేషన్ పొందారని, ఇటువంటి సర్టిఫికేట్లపై విచారణ చేపట్టి వాస్తవంగా వికలాంగులైన వారికి న్యాయం చేయాలని పలువురు వికలాంగులు కోరారు. జిల్లా విద్యాశాఖ పరిధిలో కొన్నేళ్లుగా ఆరుగురు ఉపాధ్యాయులు నకిలీ సర్టిఫికేట్లతో ఉద్యోగాల్లో కొనసాగుతున్నారని, అటువంటి వారిపై పలుమార్లు ఫిర్యాదుల వచ్చినా విచారణ పేరుతో వారిని ఉద్యోగాల్లో కొనసాగిస్తున్నారని కవిటి మండలానికి చెందిన జానకిరావు ఫిర్యాదు చేశారు. వీటిపై త్వరితగతిన విచారణ చేపట్టి సర్టిఫికేట్లను రద్దు చేయాలని కోరారు. నరసన్నపేట మండలం చిన్న బొరిగివలసకు చెందిన చెందిన బుడియా శ్రీనివాసులు గతంలో తనకున్న రేషన్ కార్డును గత ప్రభుత్వ హయాంలో రద్దు చేశారని, దాన్ని పునరుద్ధరించాలని వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం నగరంలోని శరంగడోల వీధిలో నివాసముంటున్న బరాటం కృష్ణమూర్తి బ్యాటరీ ట్రై సైకిల్ మంజూరు చేయాలని కోరారు. కొత్తూరు మండలం కుంటిభద్రకు చెందిన రుద్రపంక్తి బాలకృష్ణ తనకు 2017లో ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసిందని, మంజూరు పత్రాలు ఇచ్చినా నేటికీ ఇల్లు ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. తనకు నివాస యోగ్యమైన ఇంటిని నిర్మించుకునేందుకు వీలు కల్పించి ఇళ్ల మంజూరు చేయాలని కోరారు. వ్యక్తిగత అవసరాలు, సామాజిక అవసరాలను తీర్చాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా 14మంది తమ వినతులను అందజేశారు. జెసితో పాటు డిఆర్ఒ వెంకటేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజు, వికలాంగుల శాఖ ఎడి కె.కవితలు హాజరై వినతులను స్వీకరించారు. స్వాభిమాన్ కార్యక్రమానికి డిసిహెచ్‌ఎస్ ఎన్.కళ్యాణబాబు, జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి సాయికుమార్, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్లుగా పిసిని, పొత్రకొండ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టిడిపి కూటమి ప్రభుత్వం మరో విడత కార్పొరేషన్లకు డైరెక్టర్లను శుక్రవారం నియమించింది. అందులో తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్లుగా జిల్లాలో ఇద్దరికి చోటు దక్కింది. శ్రీకాకుళం నుంచి జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, టిడిపి నుంచి పాతపట్నం నియోజకవర్గం కొత్తూరుకు చెందిన పొత్రకొండ మోహనరావును నియమించారు. వీరి నియామకంపై ఆయా పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చంద్ర మోహన్



మోహన రావు

సాహస శిబిరానికి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలిలో అటల్ బిహారీ వాజ్‌పాయ్ మౌంటెనిరింగ్ అండ్ ఏలైడ్ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈనెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్న ఎన్ఎస్ఎస్ జాతీయ సాహస శిబిరంలో పాల్గొనేందుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం విద్యార్థుల బృందాన్ని శుకక్రవారం ఎంపిక చేశారు. బిఆర్ఎయు నుంచి ఎనిమిది మంది, సూర్యతేజ డిగ్రీ కళాశాల (పలాస)కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. ఈనెల 29వ తేదీ వరకు కొనసాగే ఈ సాహస శిబిరంలో పాల్గొనేందుకు బృంద సభ్యులు శనివారం బయలుదేరనున్నారు. వర్శిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని, రెక్టార్ బి.అడ్డయ్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జి కో-ఆర్డినేటర్ డి.వనజ తదితరులు ఈ బృందానికి అభినందనలు తెలిపారు. బిఆర్ఎయు విశిష్టతను జాతీయస్థాయిలో చాటిచెప్పాలని సూచించారు. వర్శిటీ ఎన్ఎస్ఎస్ పిఒ కె.కరుణానిధి పర్యవేక్షణలో ఈ బృందం ఈ సాహస శిబిరంలో పాల్గొనుంది.

18న జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనశాఖ సంయుక్తంగా నగరంలోని గుజరాతీపేటలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 18న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి పిజి వరకు విద్యార్హతలున్న 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు గల వారు జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పలు ప్రైవేటు కంపెనీల యాజమాన్యాలు నేరుగా హాజరై ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తాయని తెలిపారు. అర్హత ఆసక్తి గల వారు విద్యార్హత సర్టిఫికేట్లు, ఆధార్, మూడు బయోడేటా పత్రాల జిరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9550967353 ఫోన్ నంబరును సంప్రదించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- పలాస

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వచ్చే ప్రజా ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని జిల్లాలెస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ఎస్‌పి ప్రజల నుంచి తొమ్మిది వినతులు స్వీకరించారు. సబ్ డివిజన్ పరిధిలోని పరిసర ప్రాంత ప్రజలు అందించిన ఫిర్యాదులను ఎస్‌పి స్వీకరించి వారి సమస్యలను విని సానుకూలంగా స్పందించారు. సమస్యలపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. తక్షణమే ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు తెలిపి చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం అందించాలని ఆదేశించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

ఈనెల 17న శ్రీకాకుళంలో జరగనున్న కళాసీ కార్మిక సంఘం 5వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని రణస్థలం మండల అధ్యక్ష, కార్యదర్శకులు బి.చిన్నారావు, కె.సూరయ్య, డి.మహాలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ వేలాదిమంది కార్మికులు ట్రాన్స్‌పోర్టు, బజారు, కాయగూరలు, కిరాణా, ఆర్‌టిసి పోర్టర్స్, బార్ కళాసీ, తోపుడు బండ్లు తదితర రంగాల్లో కళాసీలుగా పని చేస్తున్నారని, ప్రజలకు నిరంతరం అత్యవసరమైన మందులు, నిత్యాసర వస్తువులు అందిస్తునారున్నారు. రోజువారీ చేస్తున్న కూలిపనులకు సరైన కూలిరాక చాలీ, చాలని కూలీ డబ్బులతో గడుపుతున్నారన్నారు. ఐక్య పోరాటాలతోనే పైసమస్యలు పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నరసింహులు, సన్యాసి, తవుడు, కళాసీలు పాల్గొన్నారు.

సబ్ ఇఆర్‌ఒ సిబ్బందిపై విచారణ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 14న ప్రచురితమైన 'విధి నిర్వహణలో అలసత్వం' కథనంపై విద్యుత్ ఎస్ఇ ఎన్.కృష్ణమూర్తి ఆదేశాల మేరకు ముగ్గురు సభ్యులు గల విచారణ కమిటీ పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో ఉన్న సబ్ ఇఆర్‌ఒ సిబ్బందిని గురువారం విచారించారు. ఈ కమిటీలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసరావు, విద్యుత్ ఇఇ పైడి యోగేశ్వరరావు, అకౌంట్స్ ఆఫీసర్ ఫైనాన్స్ మురళీతో కూడిన ముగ్గురు సభ్యుల బృందం ప్రజాశక్తి పత్రికలో వచ్చిన కథనంపై ఆరా తీశారు. ఈనెల 5న నాగుల చవితి కారణంగా విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు విద్యుత్ వినియోగదారులు ఎవరూ రాలేదని కార్యాలయంలోని సిబ్బంది విచారణ అధికారులకు తెలియజేసినట్లు విశ్వసనీయ వర్గాల భోగట్టా. విచారణాధికారులు వచ్చే సమయానికి సంతోషిమాతను శ్రీకాకుళంలోని విద్యుత్ కార్యాలయానికి పంపించి రక్షించే ప్రయత్నం చేశారని తోటి సిబ్బంది గుసగుసలాడుతున్నారు. ఈనెల 5న విద్యుత్ కార్యాలయంలోనే ఉన్న రాజీవ్ విద్యుత్ బిల్లుల కలెక్షన్ సెంటర్‌లో చాలామంది వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించి కమిషన్ రూపేణా అదనపు రుసుం చెల్లించి చేతి చమురు వదిలించుకున్నామని విద్యుత్ వినియోగదారులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా విచారణాధికారులు నిజనిజాలను వెలికి తీసి విద్యుత్ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన ' విధి నిర్వహణలో అలసత్వంపై వచ్చిన కథనంపై విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావును ఫోన్‌లో వివరణ కోరగా ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనం నూటికి నూరుపాళ్ళ నిజమన్నారు. ఇదే విషయమై సిబ్బందిని విచారించడం జరిగిందని నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలి

పాతపట్నం: ఎపిఐఐసి ద్వారా నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను శుక్రవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సచివాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. స్థానికంగా పరిశ్రమలు నెలకొల్పితే వలసలు నివారించి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునని వివరించారు.


సిసి కెమెరా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐ

నిఘా నీడలో వనవిష్ణుపురం

పోలాకి: వన విష్ణుపురంలో మరలా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గ్రామంలో ప్రజల కదలికలు నిరంతరం గమనించే విధంగా గ్రామంలో ఎనిమిది సిసి కెమెరాలు పంచాయతీ రాజ్ శాఖ సహాయంతో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సిసి కెమేరాలు పోలాకి స్టేషన్‌లో, ఎస్‌పి కార్యాలయంలో నిరంతరం పరివేక్షణ చేస్తుంటారు. ఈ సిసి కెమెరాలను నరసన్నపేట సిఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో మరలా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్ఐ జి.రంజిత్, పోలీసులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న సంగీత విభావరి

పర్లాకిమిడి : గజపతి జిల్లా పర్లాకిమిడి జగన్నాథ మందిరంలో కార్తీక పూర్ణిమ సందర్భంగా పరలా సాంస్కృతిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైటెక్ మెడికల్ అధిపతి తిరుపతి పాణిగ్రహి, పర్లాకిమిడి నియోజకవర్గం ఎమ్మెల్యే ఎ.రూపేష్ పాణిగ్రహి, గజపతి జిల్లా పోలీస్ అధికారి (ఎస్‌పి.) జితేంద్ర పండా, కాశీనగర్ సమితి అధ్యక్షులు బల్ల సాయమ్మ, పర్లాకిమిడి మున్సిపాలిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంగీత విభావరి నిర్వహించారు. ప్రతిభ చూపించిన వారికి బహుమతులు, మెడల్స్ బహుకరించారు. కార్యక్రమంలో సాంస్కృతిక ఐక్యతకు తోడ్పడుతుందని పలువురు ప్రశంసించారు.

జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు వేదికలు


పలాస : గ్రంథాలయంలో ప్రదర్శిస్తున్న పుస్తకాలు


బూర్జ : పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఇంటర్నెట్ యుగలోనూ పుస్తకాల ప్రాధాన్యత పెరిగిందని, జ్ఞానాన్ని పొందడానికి పుస్తకాలే నిధి నిక్షేపాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. జ్ఞానాన్ని పొందడానికి పుస్తక పఠనం తప్పనిసరి అన్నారు. పుస్తకాలను చదవడం అలవాటుగా మార్చుకుంటే ఎంతో విజ్ఞానాన్ని పొందవచ్చన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాల చరిత్ర విభాగాదిపతి ఎన్.చిన్నారావు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం తరగతి పుస్తకాలే కాకుండా పరిశోధనాత్మక గ్రంథాలను చదవుకునేందుకు గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. హైస్కూల్ స్థాయి విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా ఆరోహి సంగీత కళాశాల ఉపాధ్యాయిని సాహితీ, పెంకి నాగేశ్వరరావు, చోడవరం ఈశ్వరరావు వ్యవహరించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి భాస్కర్ రాజా పాల్గొన్నారు.

లావేరు: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే గ్రంథాలయాలను వినియోగించుకోవాలని ఎంపిడిఒ పి. వెంకటరాజు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయంలో చదువుకున్న బల్ల రవిశంకర్ వారి తల్లిదండ్రులు లక్ష్మీకాంతం, ప్రకాశం జ్ఞాపకార్థం సుమారు 5 వేలు విలువ గల పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయానికి ఎంపిడిఒ చేతులమీదగా అంద జేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు టి. వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 సత్యం, గ్రంథాలయాధికారి వై.రాంబాబు, పాఠకులు హేమంత్, నవ్య, లత, యోగి, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి బాలకృష్ణ, కూర్మనాయుడు పాల్గొన్నారు.

బూర్జ: స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయం సభ్యత నమోదుపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.సునీత, ప్రభుత్వ జూనియర్ కళాశాల కామర్స్ లెక్చరర్ రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఎంపిడిఒ పి.జయంతి ప్రసాద్ ప్రారంభించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రామకృష్ణ, పాఠకులు ఉమామహేష్, శ్రీధర్, నారాయణ పాల్గొన్నారు.

నందిగాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయాధికారి ఎస్. ఉదయ్ కిరణ్, ఎంఇఒ ఎ. చిన్నారావు ఆధ్వర్యంలో సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం పుస్తక ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బెహరా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిత్యానంద పట్నాయక్, గౌరీ శంకర్, సురేష్, పి.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ అధికారి కాళ్ల రాజు, మేజర్ పంచాయతీ కార్యనిర్వాహక అధికారి వై.వరప్రసాద్, విశ్రాంత ఎపిజివి మేనేజర్ బాబురావు, గ్రామ పెద్దలు సిర్ల ప్రభాకరరావు, శిర్ల జోగారావు, ఉపాధ్యాయులు ఇప్పిలి మురళి, పెద్దింటి ఆనంద్, కాంతారావు, విక్టరీ స్కూల్, అమరజ్యోతి, గాయత్రీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.


సంతబొమ్మాళి : పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంపిడిఒ


నందిగాం: పుస్తక ప్రదర్శన


శ్రీకాకుళం అర్బన్ : పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న సూర్యచంద్రరావు


లావేరు : మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరాజు

ఆమదాలవలస : పట్టణంలోని బొడ్డేపల్లి పేటలో ఉన్న శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయాధికారి అన్నెపు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా విశ్రాంత ఉపాధ్యాయులు తమ్మినేని సూర్యనారాయణ, అంపోలు సూర్యారావు వ్యవహరించారు.

కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కొత్తూరు: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత కుదమ తిరుమలరావు ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి తెంబూరు ఇందిర, సిబ్బంది డి.లక్ష్మి పాల్గొన్నారు.

టెక్కలి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఎంఇఒలు దల్లి తులసీరావు రెడ్డి, దాసుపురం చిన్నారావు గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయాధికారి బి.రూపావతి అందు బాటులో ఉన్న పుస్తకాలను వివరించారు. కార్యక్రమంలో సహాయకులు ఆమ్మనమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- పలాస

శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద శనివారం జరగనున్న ధర్నాకు అంగన్వాడీ కార్యకర్తలు వెళ్తున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, అంగన్వాడీ యూనియన్ నాయకులు తెలిపారు. కాశీబుగ్గ ఐసిడిఎస్ పిఒ పార్వతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినీ అంగన్వాడీ కేంద్రాలను అంగన్వాడీ కేంద్రాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో మినీ అంగన్వాడీ కార్యకర్తలు టి.రాజేశ్వరి, రమ, పుష్పలత, లలిత పాల్గొన్నారు.


రాజేష్‌ను సన్మానిస్తున్న జనసేన నాయకులు

రాజేష్‌కు ఆత్మీయ సత్కారం

కవిటి: కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన జనసేన నాయకుడు లోల్ల రాజేష్‌కు జన సైనికులు, కాళింగ సామాజిక తరగతి పెద్దలు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు గౌరవం కల్పించిన కూటమి పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గొనప రాజు, పండి దేవేంద్రమూర్తి, బెందాలం వెంకటేశ్వరరావు, బెందాలం కామరాజు, పిరియా అబ్బాయి నాయుడు, కదంబాల ప్రశాంత్, కాళింగ సామాజిక పెద్దలు, జన సైనికులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు ఐదుగురు క్రీడాకారులు

ఇచ్ఛాపురం: జిల్లా కేంద్రంలో ఉన్న ఆర్ట్స్ కళాశాల మైదానంలో గురువారం అండర్- 12 క్రికెట్ సెలక్షన్లు నిర్వహించారు. ఈ సెలక్షన్లలో ఇచ్ఛాపురం ఐసిసి క్రికెట్ అకాడమీకి చెందిన సాలిన సాయి, డిషోజ్ యాదవ్, సమిత్ గౌడ్, ధక్ష, ఓం ప్రకాష్, మహేష్‌లు ఎంపికైనట్లు కోచ్ గోపి తెలిపారు. జిల్లాజట్టులో స్థానం సంపాధించిన విద్యార్థులకు తమ తోటి క్రీడాకారులు, తల్లిదండ్రులు అభినందించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు జిల్లాజట్టులో మరింత ప్రతిభ కనబరిచి రాష్ట్రజట్టులో స్థానం సంపాదించాలన్నారు.



జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఐఇఐ ఎపి కేంద్ర సభ్యులుగా రాజశేఖరరావు ఎంపిక


రాజశేఖరరావును అభినందిస్తున్న బిఆర్‌ఎయు విసి రజని

ప్రజాశక్తి- ఎచ్చెర్ల / పొందూరు

ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) ఐఇఐ ఆంధ్రప్రదేశకు సంబంధించి కేంద్ర (స్టేట్ సెంటర్) సభ్యులుగా డా.బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.చింతాడ రాజశేఖరరావు ఎన్నికయ్యారు. ఇటీవల ఐఇఐ ఎపి రాష్ట్ర డివిజన్‌కు జరిగిన ఆన్‌లైన్ పోలింగ్‌కు సంబంధించిన ఫలితం శుక్రవారం వెలువడింది. ఆంధ్రప్రదేశ్ ఐఇఐ రాష్ట్ర కార్యవర్గంలో ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికం డివిజన్‌లో రాజశేఖరరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డివిజన్ కార్యాలయం నుంచి ఆయనకు సమాచారం అందింది. ఈ పదవిలో డా. రాజశేఖరరావు నాలుగేళ్లు కొనసాగనున్నారు. 1920లో స్థాపించిన ఐఇఐ కలకత్తా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తుండగా విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ డివిజన్ కార్యాలయం విజయవాడలో ప్రస్తుతం పనిచేస్తుంది. ఈ నెల 30న విజయవాడలో జరగనున్న ఐఇఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో డా.చింతాడ రాజశేఖరరావు పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఐఇఐ ఎపి కార్యవర్గంలో సభ్యునిగా ఎన్నికకావడంపై బిఆర్‌ఎయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని ప్రత్యేకంగా డా.రాజశేఖరరావును అభినందించారు. ఇంజినీరింగ్, ఐటి రంగాలకు మరింత సేవలను అందించాలని సూచించారు. ఈ పదవికు ఎన్నిక కావడంపై ఐఇఐ శ్రీకాకుళం ఛాప్టర్ ఛైర్మన్, సెక్రటరీలు ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, ఎస్.నాగరాజులతో పాటు వర్శిటీ ఉన్నతాధికారులు, సహచర అధ్యాపకులు, విద్యార్థులు రాజశేఖరరావుకు అభినందనలు తెలిపారు. అభినందించిన వారిలో పొందూరు మండలం గోకర్ణపల్లి గ్రామ సర్పంచ్ చింతాడ మాధురి ,సత్యప్రసాద్, గ్రామస్తులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలులో అలసత్వం

ప్రజాశక్తి- కొత్తూరు

రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో అలసత్వం వహిస్తుందని పిఎసిఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి సిఎంగా ఉన్న సమయంలో వరికోతల ప్రారంభానికి ముందే రైతుల యొక్క ధాన్యానికి, మిల్లర్లకు జియో ట్యాపింగ్ చేసేవారని, రైతులకు సరిపడా ఎరువులను ముందుగానే సిద్ధం చేసి సచివాలయాల ద్వారా అందించేవారన్నారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం రైతులందరికీ రైతు భరోసా అందిస్తూ రైతుల పక్షపాతి అని అనిపించుకున్నారన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు పరిపాలనలో వరి కోతలు ప్రారంభించి దాదాపు పదిహేను రోజులు అయినప్పటికీ ధాన్యానికి సంబంధించిన సమాచారం, వాటిని మిల్లర్లకు అమ్ముకునే విషయానికి సంబంధించి ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి ఇకనైనా మేల్కొని రైతులు పండించిన ధాన్యానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతులకు మేలు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో యూరియా, డిఎపి బస్తాలు సచివాలయంలోనే దొరికేవని, ప్రస్తుతం రైతులు అవసరమైన ఎరువులు సచివాలయాల్లో దొరక్క అధిక ధరకు బహిరంగ మార్కెట్‌లో కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇది చంద్రబాబు రైతు వ్యతిరేకి అనడానికి ఒక గొప్ప నిదర్శనమన్నారు. సత్వరమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈయనతో పాటు మండల వైసిపి బూత్ కన్వీనర్ గండివలస ఆనందరావు, ఎంపిటిసి వనుమా లక్ష్మీనారాయణ, నీలకంఠాపురం మాజీ సర్పంచ్ తిర్లంగి కృష్ణమోహన్ ఉన్నారు.


మాట్లాడుతున్న సూర్యనారాయణ

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు


పొందూరు : శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణమోహన్

ప్రజాశక్తి- పొందూరు

గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు దోహదపడతాయని సామర్లకోట ఇటిసి అసిస్టెంట్ కమీషనర్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. మండలం పరిషత్ కార్యాలయంలో జిపిడిపిపై సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిపిడిపి ప్రణాళిక 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, ఎంపిడిఒ మీసాల మన్మధరావు, ఇఒపిఆర్‌డి పి.సింహాచలం, ఎఒ బి.బి.మిశ్రో, ఇటిసి ఫ్యాకల్టీ మెంబర్ వి.ప్రసాదరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: గ్రామ పంచాయతీల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎంపిడిఒ రోణంకి వెంకటరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులపాటు పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి తగిన ప్రణాళికలు వేసుకుంటే అభివృద్ధి బాటలో పయనించ వచ్చన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, సూపరింటెండెంట్ ఎస్. వాసుదేవరావు, ఇఒపిఆర్‌డి గోపాలరావు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్యాస్‌కు అదనంగా వసూలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి- పొందూరు

గ్యాస్ సిలిండర్లను వినియోగదారులకు డోర్ డెలివరీ చేసే సమయంలో అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని డిఎస్ఒ జి.సూర్యప్రకాశరావు హెచ్చరించారు. మండలంలోని రాపాక కూడలి వద్ద గల ఇండేన్ గ్యాస్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి కోరుకొండ సాయికుమార్ గ్యాస్ సిలెండర్లు పంపిణీ వ్యవహారంపై ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇంటింటికీ గ్యాస్ డెలివరీ చేసేటప్పుడు తప్పనిసరిగా డెలివరీ ఛార్జీ రూపంలో రూ.30 అదనంగా వసూలు చేస్తున్నట్లు ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన డిఎస్ఒ గ్యాస్ డోర్ డెలివరీ సమయంలో సిబ్బంది అదనపు వసూలు చేసినా, సమయానికి డెలివరీ చేయకపోయినా చర్యలు తప్పవని గ్యాస్ డీలర్ జి.సరోజనికి సూచించారు. ఆయనతో పాటు తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు, విఆర్ఒలు ఈశ్వరరావు, రేవతిరావు తదితరులున్నారు.

రేషన్ పంపిణీ చేయలేదని ఫిర్యాదు

పట్టణంలోని ఆస్పత్రి వీధిలో రేషన్ సరుకులు నవంబర్ నెలకు సంబం ధించి బియ్యం, పంచదార, కందిపప్పు అందలేదంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు డిఎస్ఒ విచారణ జరిపారు. తక్షణమే రేషన్ సరుకులను పంపిణీ చేయాలంటూ అధికారులను ఆయన ఆదేశించారు.


డిఎస్ఒకు వివరాలు తెలియజేస్తున్న మాజీ ఎంపిటిసి

శ్మశానవాటికకు దారేది..?


పొలాల మధ్య నుంచి మృతదేహాన్ని తీసుకువెళ్తున్న గ్రామస్తులు

కోటబొమ్మాళి: మండలంలోని కన్నేవలసలో శ్మశాన వాటికకు వెళ్లడానికి దారిలేకపోవడంతో గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన వ్యక్తి శుక్రవారం చనిపోవడంతో శ్మశాన వాటికకు వెళ్ళేందుకు దారిలేకపోవడంతో పచ్చని వరి పంటపొలాల మధ్య నుంచి మృతదేహాన్ని తీసుకువెళ్లారు. అనంతరం దహన సంస్కారాలు చేశారు. మృతదేహాన్ని తీసుకు వెళ్ళడానికి కూడా దారి లేకపోవడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. వేసవి కాలంలో ఎలాగోలా తీసుకువెళ్తున్నామని, వర్షాకాలం, పంటలు సాగుచేసే సమయంలో మాత్రం నరకం అనుభవిస్తున్నామని అవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటికకు రోడ్డు నిర్మించాలని ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు శ్మశాన వాటికకు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బావిలో పడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి- పలాస

పట్టణంలోని రెల్లివీధిలో బావిలో పడి బేకరీ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న దున్న వీరాస్వామి (52) శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఈయన స్వగ్రామం ఇచ్ఛాపురం. ఈయనకు భార్య రాజు, కుమార్తె లక్ష్మి, కుమారుడు తేజ ఉన్నారు. కొద్ది రోజుల క్రితం మధు బేకరీలో పనిచేయడానికి ఇక్కడకు వచ్చాడు. మద్యం అలవాటు ఉన్న ఈయన బావివద్దకు రాగా ప్రమాదవశాత్తు తూలిపడి మృతిచెందాడు. కాశీబుగ్గ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని అతికష్టంపై బయటకు తీశారు. భార్యా, పిల్లల నుంచి పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- పలాస

మండలం గంగువాడ గ్రామం వద్ద ద్విచక్ర వాహనంపై వస్తున్న బలరాం పాత్రోకు ట్రాక్టర్ ఢీ కొనడంతో గాయాల పాలయ్యారు. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకొని క్షతగాత్రుడును చికిత్స నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

పేపర్ ప్లేట్ల పరిశ్రమలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి- పలాస

పలాస లేబర్ కాలనీలో టంకాల సునీల్ అనే వ్యాపారికి చెందిన పేపర్ ప్లేట్ల పరిశ్రమలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో రూ.10 లక్షల విలువైన రెండు పేపర్ ప్లేట్ యంత్రాలతో పాటు ముడిసరుకు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపకశాఖ అధికారులు భావిస్తున్నారు. సకాలంలో వారు చేరుకొని మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రాంతంలో మొదటి పేపర్ ప్లేట్ పరిశ్రమ నిర్వహిస్తు అనేక మందికి వ్యాపారవేత్త ఉపాధి కల్పిస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో యంత్రాలన్ని దగ్ధం కావడంతో ఆయన తీవ్ర వ్యక్తం చేశారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దాడులు చేపట్టారు. ఒడిశా నుంచి అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఒడిశా నుంచి అక్రమంగా మద్యం సీసాల రవాణాపై గట్టి నిఘా పెట్టడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో శివంగి మాధవరావు అనే వ్యక్తి నుంచి 14 మద్యం సీసాలు స్వాదీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. నిందితుడిని కవిటి తహశీల్దార్ వద్ద బైండోవర్ చేయడం జరిగిందన్నారు.

స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించాలి

టెక్కలిరూరల్: ప్రజలపై భారాలను భరించలేం, స్మార్ట్‌మీటర్లును వ్యతిరేకంచాలని సిపిఎం నాయకులు నంబూరి షణ్ముఖరావు అన్నారు. శుక్రవారం ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా తాహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం తహశీల్దార్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలపై భారాలు వేయడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని, గత ప్రభుత్వ తప్పిదాలను విమర్శిస్తూ నేడు కూటమి ప్రభుత్వం కూడా ప్రజలపై భారాలు వేస్తూ అబద్దాలతో, అజ్ఞానాన్ని ప్రజల బుర్రలకు ఎక్కించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దుచేయాలని, ఉచిత ఇసుక అమలు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, ఉద్యోగుల తొలగింపు విరమించాలని డిమాండ్ చేశారు. మహిళలు, మైనార్టీలు, దళితులపై దాడులు, అత్యాచారాలు అరికట్టాలని, రాజ్యాంగ వ్యతిరేక జమిలి ఎన్నికలు వద్దు అంటూ తదితర ప్రజాసమస్యలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి యల్లయ్య, బగాది వాసుదేవరావు, హెచ్ ఈశ్వరరావు, దుర్గాప్రసాద్, కొర్రా గణేష్, తిర్లంగి అప్పన్న, వాకాడ ధనుంజయ, కెఎన్‌పిఎస్ నాయకులు బెలమర ప్రభాకర్, సమాచారహక్కు చట్టం ప్రతినిధి అనపాన షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

గిరిజనుల హక్కులు తెలుసుకోవాలి



పలాస : మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- పలాస

గిరిజనులు వారికి ఉన్న హక్కులను తెలుసుకోవడం ఎంతో అవసరమని ఎంపిడిఒ వసంత్ కుమార్ అన్నారు. భగవాన్ బిర్సా ముండా 150 జయంతి సందర్భంగా గిరిజనులకు ఆయన చేసిన సేవలను స్మరిస్తూ మండలం లోత్తూరు, దానగోరలో శుక్రవారం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభ అనేది గ్రామ ప్రాథమిక నిర్ణయాధికార సంస్థ అని అన్నారు. గ్రామంలోని భూమి, నీరు అడవులతో సహా సహజ వనరులను, రాజ్యాంగంలోని నిబంధనలకు అనుగుణంగా, కాలానుగుణంగా అమలులో ఉన్న ఇతర సంబంధిత చట్టాలకు అనుగుణంగా ఏదైనా మత్తు పదార్థాల అమ్మకం, వినియోగాన్ని నియంత్రించడం, పరిమితం చేయడం జరుగుతుందన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో భూమి ఆక్రమణను నిరోధించడానికి, షెడ్యూల్డ్ తెగలకు చెందిన అక్రమంగా ఆక్రమించబడిన ఏదైనా భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సవర పద్మావతి, పంచాయతీ విస్తరణ అధికారి మెట్ట వైకుంఠరావు, లోత్తూరు ఇన్‌ఛార్జి కార్యదర్శి సద్గుణ బాబు, తర్లకోట కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని లబ్బ పంచాయతీలో అధికారికంగా గిరిజన నాయకుడు బిర్సా ముండా జయంతి వేడుకలు వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన నాయకుడు బిర్సా ముండా భారతీయ అటవీ జాతుల స్వాతంత్ర్య సమరయోధుడు, జానపద నాయకుడని, భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచిపోయాడన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సవర సావిత్రి, ఇఒపిఆర్‌డి వసంత కుమారి, సర్పంచ్ అడపాకల శంకరరావు, మాజీ ఎంపిటిసి కొయిలాపు సంజీవరావు, టిడిపి నాయకులు తిరుపతిరావు, పాలక రామ్మోహన్, మంగులు, రవ్వల మన్మోహన్, సవర వరాలయ్య, సవర సింహాచలం పాల్గొన్నారు.



నివాళ్లర్పిస్తున్న శ్రీనివాసరావు

శ్రీకాకుళం అర్బన్: గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధులు బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు నగరంలోని బలగ సమీపాన గల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. బిర్సా ముండా చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు నివాళ్లర్పిస్తున్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన వక్తృత్వం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అలాగే 8,9 తరగతి విద్యార్థులకు విలువిద్య, వాలీబాల్, జావోలిన్ త్రో పోటీలను నిర్వహించారు.



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు

అభివృద్ధి దిశగా మున్సిపాలిటీ

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీని అభివృద్ధి దిశగా పయనించాలనే ఉద్దేశంతోనే పనిచేస్తున్నామని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.ఐదు లక్షలతో ఐటిఐ దగ్గర రహదారి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి ఇటీవల కాలంలో మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో సమాన ప్రాతిపదికన వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టామని, ప్రజలందరికీ మౌలిక సదుపాయాలు అందించేందుకు తనతో పాటు అధికార యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబురావు, టిడిపి నాయకులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, టంకాల రవిశంకర్ గుప్తా, డిఇఇ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



వరిపంట దిగుబడిని పరిశీలిస్తున్న సురేంద్ర

3,266 వరి పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి- పొందూరు

ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 3,266 వరి పంటకోత ప్రయోగాలను ఎంపిక చేసినట్లు జిల్లా ఉపగణాంక అధికారి దేసూళ సురేంద్ర తెలిపారు. మండలంలోని గోకర్ణపల్లి, కొల్లిపేటలో శుక్రవారం నిర్వహించిన వరి పంటకోత ప్రయోగాలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3,266 పంటకోత ప్రయోగాలకు ఇప్పటివరకూ 186 పంటకోత ప్రయోగాలు పూర్తయినట్లు తెలిపారు. మండలంలో దిగుబడులు సాధారణంగా ఉందన్నారు. మండలంలో ఎకరాకు 20 నుంచి 22 బస్తాలు దిగుబడి వస్తున్నట్లు అంచనా వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఒ శేఖర్‌బాబు, ఇన్సూరెన్స్ ప్రతినిధి త్రోయాజాక్షి, విఎఎలు గాయత్రి, వనజాక్షి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

క్రమశిక్షణను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సమయపాలన అలవర్చుకోవాలని ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి సూచించారు. నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. మాట తీరు, పెద్దలంటే గౌరవం ద్వారా వినయ విధేయతలు అలవర్చుకోగలరన్నారు. పరిసరాల పరిశుభ్రత వల్ల ఆరోగ్యంపై శ్రద్ధ వహించగలరని చెప్పారు. అనంతరం పోటీల్లో విజేతలకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ అన్నెపు లావణ్య, రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లావణ్య

చట్టాలపై అవగాహన అవసరం

పాతపట్నం: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఫోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని ఎస్ఐ బి.లావణ్య నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే అన్ని చట్టాలపై అవగాహన ఉండాలని, పోక్సో చట్టం మహిళలకు రక్షణ కవచం లాంటిదన్నారు. ఎవరైనా వారిపై తప్పుగా ప్రవర్తించిన వెంటనే తల్లిదండ్రులకు చెప్పి స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ మోసాలపై కూడా విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

బూర్జ : మండలంలోని తమ్మినాయుడు పేట గ్రామపంచాయతీలో గల చిగిన్నాయుడు చెరువు పరిధిలో గల రెవెన్యూ భూములు అస్తవ్యస్తంగా ఉండడం వలన గ్రామంలోని రైతులందరూ తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో భూములను కొనుగోలు చేయాలన్నా, అమ్మకం చేయాలన్నా వన్ బి, అడంగల్ రాక పోవడంతో సుమారు నాలుగేళ్ల నుంచి రిజిస్ట్రేషన్లు అవ్వకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రస్తుతం భూముల రీ సర్వే జరుగుతుండడం వలన రైతుల యొక్క భూములను రైతుల పేరున వచ్చేలా చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగేటట్లు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వసతిగృహం తనిఖీ

కొత్తూరు: మండలం కారిగూడలోని ఎస్‌టి వసతిగృహాన్ని వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో హాస్టల్ విజిట్ చేసిన సమయంలో హాస్టల్లో విద్యార్థులకు భోజనం సరిగా అందించటం లేదని తెలపగా అప్పటి ఐటిడిఎ పిఒ రాహుల్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్కూల్‌ను, హాస్టల్‌ను తనిఖీ చేసి అప్పటి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి ప్రస్తుతం భోజనం ఎలా ఉందని, విద్యాబోధన ఏవిధంగా ఉందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అదనపు భవనాల కోసం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చూస్తానన్నారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు కొయిలాపు సంజీవరావు, అడపాకల శంకరరావు, తిరుపతిరావు ఉన్నారు.



సర్వే చేస్తున్న రైల్వే సిబ్బంది

నౌపడ - గుణుపూర్ డబుల్ లైన్ సర్వే

పాతపట్నం: నౌపడ నుంచి గుణుపూర్ వరకు డబుల్ లైన్ ఏర్పాటు చేయడానికి రైల్వే అధికారులు శుక్రవారం సర్వే చేశారు. మండలంలోని తెంబూరు, గంగువాడ, పాతపట్నం రైల్వేస్టేషన్ల వద్ద సర్వే చేశారు. నౌపడ రైల్వే స్టేషన్ నుంచి ఒరిస్సాలోని గుణుపూర్ వరకు ప్రస్తుతం సింగల్ లైన్ రైల్వే ట్రాక్ ఉందని, సర్వే పూర్తయి భూ సేకరణ చేపట్టిన తరువాత డబుల్ లైన్ నిర్మాణ పనులు చేపడతామని రైల్వే అధికారులు తెలిపారు.

రాపాకలో అన్నదానం

ప్రజాశక్తి- పొందూరు

మండలం రాపాకలో నారాయణమ్మ పేరంటాలు నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా పతివాడ సన్యాసప్పుడు, సరస్వతమ్మల జ్ఞాపకార్థం శుక్రవారం ఆయన కుమారుడు పతివాడ రమణమూర్తి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే దుర్గాదేవి అమ్మవారి ఆలయం వద్ద కోటి స్వామి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి వేలాది మంది యాత్రికులు హాజరయ్యారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న యాత్రికులు

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- పలాస

ఈనెల 27 నుంచి 30 వరకు విజయనగరం పట్టణంలో జరుగుతున్న ఎఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎఐఎస్ఎఫ్ నాయకులు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను సుదీర్ఘంగా ఈ మహాసభల్లో చర్చించి ఉద్యమాలకు సన్నదమవ్వడానికే ఈ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే విద్యల నగరంగా పేరుగాంచిన విజయనగరంలో స్వతంత్ర సంగ్రామంలో ఉజ్వల చరిత్ర కలిగిన ఎఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు జరుపుకోవడం విశేషమన్నారు. ప్రజాస్వామిక దేశంలో అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. విజయనగరం జిల్లాలో మహాకవి గురజాడ, శ్రీశ్రీ, నారాయణ బాబు, చాసో వంటి సాహిత్య వేత్తలకు నిలయమైన విజయనగరంలో మహాసభలు నిర్వహించడం ద్వారా వారి స్ఫూర్తితో ముందుకు పోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ పలాస నియోజకవర్గ కార్యదర్శి ఇ.గుణశేఖర్, ఎఐఎస్ఎఫ్ నాయకులు సృజన, వెంకటేష్, మనోజ్, నీలవేణి, విద్యార్థులు మాధవి, యోగేంధర్, రోహిత్, చరణ్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు



డిటి శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న 108 సిబ్బంది

108 సిబ్బంది సమ్మె నోటీసు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

108 అంబులెన్స్ సర్వీస్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు సుదీర్ఘకాలంగా అపరిష్కృత సమస్యల పరిష్కారం కానందున 25 నుంచి సమ్మెకు వెళ్తున్నామని స్థానిక డెప్యూటీ తహశీల్దార్ శ్రీహరికి వినతిపత్రం అందించారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈ సమ్మె చేస్తున్నట్లు యూనియన్ నాయకులు గోవిందరావు, తనూజ కుమార్, అప్పల నాయడు తెలిపారు. జిఒఎంఎస్ నెం.49 అమలు పునరుద్ధరించాలని, ఎఇఎంఎస్ సంస్థ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఉద్యోగులకు ప్రతి నెలా జీతాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం కారణంగా ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారన్నారు. ప్రతి మండల కేంద్రంలో 108 సిబ్బందికి కనీస అవసరాలు గల భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ నోటీసు అందించినట్టు తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్ల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.

సొండి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

టెక్కలి: రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఉన్న సొండి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాహుకారి నాగేశ్వరరావు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును అమరావతిలో కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తు కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరిస్తానని హామీనిచ్చినట్లు తెలిపారు. అనంతరం జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలకు కూడా వినతిపత్రం అందించినట్టు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో రాష్ట్ర కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, గజవిల్లి నాగభుషణం, రత్నాల జగన్మోహనరావు, అప్పలరాజు, సంతోష్‌కుమార్ తదితరులున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మాదకద్రవ్యాలతో ప్రమాదం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నిహార్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మాదక ద్రవ్యాలతో యువతకు ప్రమాదం పొంచి ఉందని, దీని నిర్మూలనకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలని ఎస్ఐ కె.నిహార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పూండిలో సాయివినీత్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు 'సంకల్పం' అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వల్ల ఆరోగ్యం గుల్లవుతుందని, కోలుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కళాశాలలో ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేస్తామని, విద్యార్థినులు తమకు ఎదురైన ఇబ్బందులు ఫిర్యాదు పెట్టెలో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.కైలాశరావు, అధ్యాపకులు జి.సాయి గోపాల్, బి.ధర్మారావు, ఎస్.షన్ముకరావు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు ఇవ్వాలి

టెక్కలి: పట్టణంలోని కంకరబందలో నిర్మించిన హుదూద్ ఇళ్ల మంజూరులో అర్హులైన పేదలను గుర్తించి వారికి పట్టాలివ్వాలని డాక్టర్ హనుమంతు ఉదయ్‌భాస్కర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం టెక్కలి ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ రషీద్ ఆహ్మద్‌కు వినతిపత్రం ఆందించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగాయన్నారు. ఆర్హులైన వారికి కాకుండా నిబంధనలను తుంగలో తొక్కి జాబితాలను మార్చారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఆక్రమాలు బయటపడతాయనే ఉద్దేశ్యంతో వైసిపి నాయకులు ఇళ్ల మంజూరు ప్రక్రియని రాజకీయం చేస్తున్నారన్నారు. దీనిపై చర్యలు తీసుకుని అర్హులకు ఇళ్ల మంజూరు చేయాలని ఉదయ్‌భాస్కర్ కోరారు.



ఎఒకు వినతిపత్రం అందజేస్తున్న ఉదయ్‌భాస్కర్

మా భూములకు లాగిన్ ఇవ్వండి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్లాం పంచాయతీ పరిధిలో గల అగ్రహారం భూములకు గతంలో వలే లాగిన్ ఇవ్వాలని సంబంధిత రైతులు శుక్రవారం తహశీల్దార్ అప్పలస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తమ భూముల క్రయ విక్రయాలు సులువుగా చేసుకునే వాళ్ళమని, ప్రభుత్వ సహాయం కూడా పొందే వాళ్లమన్నారు. ప్రస్తుతం వాటికి లాగిన్ అవ్వకుండా చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రైతు ప్రతినిధులు ఆర్.జానకిరావు, పి.ఢిల్లీరావు, పి.జోగారావు, ఆర్.అప్పన్న, కె.సుధాకర్, పి.మోహనరావు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని పాఠశాలలకు సంబంధించిన అపార్ నమోదులో పొరపాట్లును సరి చేసేందుకు ఆయా క్లస్టర్ పరిధిలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఎంఇఒ గెడ్డాపు రాజేంద్రప్రసాద్ కోరారు. శుక్రవారం మండలంలోని కొర్లకోట హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఎంఇఒ, ఎంపిడిఒ రోణంకి వెంకట్రావు సందర్శించి తప్పుల సవరణలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ అపార్ పెండింగ్‌కు కారణమైన బర్త్ సర్టిఫికెట్లు ఉండి నేమ్ మిస్ మ్యాచ్, డేట్ అఫ్ బర్త్ కరెక్షన్స్ ఉంటే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు పట్టుకొని వచ్చి సరిదిద్దుకోవాలన్నారు. అలాగే మండలంలోని కొర్లకోట, అక్కులపేట, దూసిపేట, తొగరాం, పట్టణంలోని లక్ష్మీనగర్ గవర్నమెంట్ హైస్కూల్‌లో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కొర్లకోట ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ, ఎంఇఒ

అవుట్‌సోర్సింగ్ సిబ్బంది విధులకు డుమ్మా

ప్రజాశక్తి- పొందూరు

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిరోజు విధులకు హాజరుకావాల్సిన ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధులకు హాజరు కాకుండా డుమ్మా కొడుతున్నారు. డిగ్రీ కళాశాలలో 13 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. కొంతమంది విధులకే హాజరుకావడం లేదని, మరికొంతమంది విధులకు హాజరై సంతకాలు చేసి వెళ్ళిపోతున్నారని కళాశాల విద్యార్థులు, పట్టణవాసులు ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువెళ్ళారు. పరిస్థితిని సమీక్షించాలని మండలపార్టీ అధ్యక్షులు రామ్మోహన్, మాజీ ఎఎంసి చైర్మన్ అన్నెపు రాముకు ఎమ్మెల్యే సూచించడంతో ఉదయం 11.30 గంటలకు కళాశాలను పరిశీలించగా కేవలం ఐదుగురు మాత్రమే హాజరైనట్లు, మిగిలిన వారు హాజరుకానట్లు గుర్తించారు. కాని హాజరు పట్టికలో 11 మంది సంతకాలు చేసి ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపాల్ ఉదయలక్ష్మికి ఫోన్ చేయగా తాను సెలవులో ఉన్నట్లు తెలిపారు. కళాశాలలో ఎటువంటి సైన్స్‌ల్యాబ్‌లు లేకపోయినా నలుగురు సిబ్బంది ఉన్నట్లు గుర్తించారు. దీనిపై ఎమ్మెల్యే రవికుమార్‌కు సమాచారం ఇస్తామని అన్నెపు రాము తెలిపారు.



హాజరు పట్టికను పరిశీలిస్తున్న మాజీ ఎఎంసి చైర్మన్ రాము


సముదాయాలు వాయిదా

టెక్కలి: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న పాఠశాలల సముదాయాల తేదీల్లో స్వల్ప మార్పులు చేస్తూ విద్యాశాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించాల్సిన పాఠశాలల సముదాయాలు, సబ్జెక్టు సముదాయాలను ఒకరోజు వాయిదా వేశారు. 18న కార్తీక మాస సోమవారం కావడంతో కొన్ని పాఠశాలలు సెలవులు మంజూరు చేయనున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలల సముదాయాల తేదీలు 19, 20 తేదీలకు మార్పులు చేస్తు తాజాగా ఆదేశాలు జారీ చేశారు.

లాప్‌టాప్ అందజేత

ప్రజాశక్తి- సారవకోట

సారవకోట మండల తాహశీల్దార్ కార్యాలయ అవసరాల నిమిత్తం తహశీల్దార్ విజయలక్ష్మికి శుక్రవారం మండల టిడిపి నాయకులు, బిసి కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్ లాప్‌టాప్‌ను అందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, మాజీ ఎంపిటిసి కోన వెంకటేష్, నక్క గోపి, నాయకులు దువ్వారి జయరాం, రావాడ సురేష్, కొర్ను హేమంత్, సూరపు రమేష్, విఆర్ఒ బాలకృష్ణ ఉన్నారు.



సన్మానం చేస్తున్న అగ్నికుల క్షత్రియ ప్రతినిధులు

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర అగ్నికుల క్షత్రియ చైర్మన్ చిలకలపూడి పాపారావుకు నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు కుత్తుం లక్ష్మణ్ కుమార్, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణలు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. పలాస నియోజకవర్గంలో ఉన్న అగ్నికుల క్షత్రియ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు.

అంగన్వాడీ భవనాల నిర్మాణానికి ఆమోదం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని గోకర్ణపల్లి, రంగనాథపేటలో నూతనంగా అంగన్వాడీ భవనాల నిర్మాణానికి పరిపాలనా ఆమోదం ఇచ్చినట్లు శుక్రవారం ఆమదాలవలస టిడిపి కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది. ఈ గ్రామాల్లో అంగన్వాడీ భవనాల నిర్మాణం కొరకు రెండు పనులకు రూ.20లక్షల అంచనా విలువతో 2024-25 సంవత్సరం జిల్లా పరిషత్ సాధారణ నిధులు 15 శాతం స్త్రీ సంక్షేమ పద్దుశాఖ మంజూరు చేస్తూ పరిపాలనా ఆమోదం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా అంగన్వాడీ భవనాలు మంజూరు చేయడంపై ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావులు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని టెక్కలి అర్బన్ సిఐ అంబటి విజయకుమార్ అన్నారు. శుక్రవారం బాలికల వసతి గృహంలో మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగంతో వచ్చే అనర్థాలను వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

రాజ్యాంగ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కుల సంరక్షణలో భాగంగా ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ బొడ్డేపల్లి మోహనరావు తెలిపారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియం ఆవరణలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్లను శుక్రవారం ఆవిషఉకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26న రాజ్యాంగ దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేదిక సభ్య సంఘాల జిల్లా బాధ్యులు మిస్కా కృష్ణయ్య, పేడాడ కృష్ణారావు, డి.గణేష్, కళ్లేపల్లి రాంగోపాల్, చౌదరి లక్ష్మణరావు, కె.వి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

బాలియాత్ర విజయవంతం చేయాలి

కోటబొమ్మాళి: ఈ నెల 17న మధ్యాహ్నం రెండు గంటలకు వంశధార నదీ తీరాన శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో కళింగసీమ ప్రాచీన సాంప్రదాయమైన బాలియాత్ర పున్నప్రారంభానికి మండలంలోని ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని బాలియాత్ర కోటబొమ్మాళి ప్రచారకర్తలు ఎల్.కరుణాకర్, మూల తరుణ్ పిలుపునిచ్చారు.

రోడ్డు పనులు ప్రారంభం

టెక్కలి: పట్టణంలోని భవానీనగర్ ప్రాంతంలో సిసిరోడ్లు, కాలువలు నిర్మాణ పనులను టిడిపి పట్టణ అధ్యక్షులు కోళ్ల లవకుమార్ శుక్రవారం ప్రారంభించారు. సంక్షేమం దృష్ట్యా ప్రజా అవసరాలు మెరుగుపడేందుకు మంత్రి అచ్చెన్నాయుడు కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కొళ్ల కామేష్, కోరాడ రాంప్రసాద్, టంకాల వెంకటరమణ, మల్లిపెద్ది మధు, జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న లవకుమార్